క్లుప్తంగా...

నేడు ఉచిత వైద్య శిబిరం

అల్వాల్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం యాప్రాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే వైద్య శిబిరంలో బీసీ, షుగర్, సాధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు వివాహ పరిచయ వేదిక

మల్కాజిగిరి: కాప్రా నగర బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం మల్లాపూర్ రామానుజ మందిరం ప్రాంగణంలో ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తామన్నారు. వివరాలకు ఫోన్: 96423 14535.

రాగి ఆకుపై అంబేడ్కర్



అల్వాల్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా అల్వాల్‌కు చెందిన స్వర్ణకారుడు పూన ప్రదీప్‌కుమార్ రాగి ఆకుపై అంబేడ్కర్ చిత్రం గీశాడు. దీంతో పలువురు అతడిని అభినందించారు.

సమయానికి నీటిని సరఫరా చేయాలి



అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలకు తాగునీటి సరఫరాను మెరుగు పర్చాలని కోరుతూ గురువారం జల మండలి జీఎం సునీల్‌కుమార్‌కు కార్పొరేటర్ సబితకిషోర్ వినతి పత్రం అందజేశారు. సమయానికి నీటిని సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



చీఫ్ ఎంటమాలజిస్ట్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ జీహెచ్‌ఎంసీ చీఫ్ ఎంటమాలజిస్ట్ రాంబాబుకు విజ్ఞప్తి చేశారు. శ్రవణ్ మాట్లాడుతూ చెరువుల వద్ద మురుగునీరు, గుర్రపు డెక్క ఉండటంతో దోమల బెడద ఎక్కువ ఉందని, ఫాగింగ్‌తో పాటు యాంటీ లార్వా ఆపరేషన్ పెంచాలని కోరినట్లు చెప్పారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషిచేస్తా



రాజు యాదవ్‌ను సత్కరిస్తున్న నాయకులు

మల్లాపూర్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఉప్పల్ నియోజకవర్గం భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పంజా రాజుయాదవ్ అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా పలు నేతలు పంజారాజుయాదవ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బుసాని రఘు, మారుతీరావు, దత్తు, ప్రవీణ్, శ్రీకాంత్, ధన్‌రాజ్, దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి



రంజాన్ తోఫాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని దుర్గానగర్‌లో రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసుగౌడ్, స్థానికులు నయిమ్, పొన్నాల మహేందర్, జబ్బర్, జయరాజు, రాపోలు శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో దోమల బెడద..

వీధిలో కుక్కల భయం

- మురుగునీరు, వ్యర్థాల్లో దోమల వృద్ధి
- కాలనీల్లో పెద్దఎత్తున కుక్కల స్వైరవిహారం
- కుక్క కాట్లకు గురవుతున్న కాలనీవాసులు
- కాపాడాలంటున్న కాలనీల ప్రజలు



కాలనీల మధ్యలో ఉన్న సుద్దకుంట చెరువు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో దోమల బెడద తీవ్రంగా ఉంది. దోమల కారణంగా ఇళ్లలో ఉండలేని దుస్థితి నెలకొంది. ఎవరైనా కాలక్షేపం, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం బయటకు వెళ్లదామంటే ఒకవైపు దోమలు, మరోవైపు కుక్కల భయం వేధిస్తోంది. బోడుప్పల్ నగర వాసులు వీటితో నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నారు. నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న ఓపెన్ డ్రైన్లు, చెరువుల్లోని మురుగునీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. వాటిని నియంత్రించేందుకు అటు అధికారులు, ఇటు పాలకవర్గంగానీ పూర్తిస్థాయిలో నివారణ చర్యలు తీసుకోవడం లేదు. దీంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు ప్రజలకు నరకాన్ని చూపుతున్నాయి.

వ్యర్థాల్లో దోమల వృద్ధి

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో నాలుగు చెరువులున్నాయి. వాటిలో రా చెరువు, అల్మాస్ కుంట చెరువు, సుద్దకుంట చెరువు, చింతల చెరువులున్నాయి. నగర ప్రజల సౌకర్యార్థం 15 సంవత్సరాల నుంచి కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. డ్రైనేజీని సదరు చెరువులోకి వదులుతున్నారు. అక్కడ నుంచి మురుగు నీరు దిగువ ప్రాంతానికి వెళ్లేందుకు అవుట్‌లెట్ లేదు. అంతేగాకుండా చెరువుల్లో కొంత మంది స్థానికులు వివిధ రకాల వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో చెరువులోని మురుగు నీటిలో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. వీటి వల్ల బోడుప్పల్ నగర ప్రజలు నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నారు.

అపరిశుభ్రతతో పెరుగుతున్న దోమలు..

నగర పాలక సంస్థ పరిధిలో అపరిశుభ్రత, వ్యర్థాలతో కాలనీల్లో దోమలు పెరుగుతున్నాయి. కొంతమంది కాలనీవాసులు తమ ఇళ్లలోని చెత్త చెదారంతో పాటు వ్యర్థాలను రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో వేస్తున్నారు. అంతేగాకుండా కొన్ని చోట్ల తాగునీటి పైపులైన్ల లీకేజీ, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగడం, ఇళ్లలోని నీటిని రోడ్లపైకి వదులుతున్నారు. దీంతో రోడ్లపై నీటి నిల్వలు పెరిగి అందులో దోమలకు ఆవాసం ఏర్పడి వృద్ధి చెందుతున్నాయి. వీటి వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

కుక్క కాట్లతో భయం.. భయం



నగర పాలక సంస్థ పరిధిలో 170కు పైగా కాలనీలున్నాయి. వాటిలో 25వేల వరకు వీధి కుక్కలున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 500 మంది కుక్కకాట్లకు గురయ్యారు. వీటి నివారణ కోసం చెంగిచర్లలో కు.ని.(కుటుంబ నియంత్రణ) చేపట్టారు. ఇప్పటి వరకు 3,600 కుక్కలకు కు.ని. చేపట్టినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. ఇందుకోసం రూ.57.60 లక్షలు ఖర్చు చేశారు. కుక్కల రోడ్లపై గుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో ఇళ్లలోంచి కాలు బయట పెడితే వాటి కాటుకు గురవుతున్నారు. దీంతో కాలనీవాసులంతా భయాందోళన చెందుతున్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

దోమల నివారణకు అధికారులు, పాలకవర్గం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలి. తూతూ మంత్రంగా ఫాగింగ్ చేస్తున్నారు. కుంటలు, చెరువులో పేరుకుపోయిన చెత్తను, పూడికను తొలగించడం లేదు. దీని వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. చాలామంది ఇంటి యజమానులు దోమల నివారణకు రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఆల్‌అవుట్, దోమలబత్తీలు, మస్కిటోస్ వాడుతున్నారు. అయినా దోమ కాట్లతో చాలామంది అనారోగ్యానికి గురవుతున్నారు.

- బి.కుమార్ స్వామి, బోడుప్పల్‌వాసి

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్: ఈ నెల 16వ తేదీన జరగనున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్‌లో గురువారం బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, భూక్యా సుమన్ నాయక్, నేతలు కొత్త రవిగౌడ్, పులకండ్ల జంగారెడ్డి, దానగల్ల యాదగిరి, చంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద మెట్లకు మెరుగులు



మెట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

ఉప్పల్: రూ.12 లక్షలతో ఉప్పల్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మెట్ల దారిని పునరుద్ధరించినట్లు చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నా గీత ప్రవీణ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ సర్కిల్ ఏఈ రాజ్‌కుమార్‌తో కలిసి పనులను పరిశీలించారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా శిథిలావస్థకు చేరిన మెట్లను తొలగించి నూతన మెట్లను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. అనుకున్న సమయంలోనే మెట్లను పునరుద్ధరించిన అధికారులను కార్పొరేటర్ ప్రశంసించారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి తదితరులు పార్గొన్నారు.

దళితులకు ఇచ్చిన హామీలను మరిచిన సీఎం కేసీఆర్



మచ్చబొల్లారంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

అల్వాల్: రాజ్యాంగ విలువలను పాటించని వారు అంబేడ్కర్ ఆశయాలను సాధిస్తామని ప్రచారం చేసుకోవడం శోచనీయమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు దండుగుల వెంకటేష్ అన్నారు. గురువారం మచ్చబొల్లారంలోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద గురువారం బీజేపీ దళితమోర్చా నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. అధికారంలోకి రాకముందు దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, దళితులకు మూడు ఎరకాల భూమిని ఇస్తానని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో దళితులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్ పద్మిని, రమేష్, అనిల్ రాజ్, ప్రతిభ, వినయ్, శంకర్, కర్ణశ్రీ, అజిత్‌సాయి, ఆనంద్, తిరుపతిరెడ్డి, సుజాత, గోపి, అనురాధ, పీవీ శ్రీకాంత్, బాలకృష్ణ, శేఖర్, శాస్త్రీ, సాయికుమార్ పాల్గొన్నారు.

నియామకం



సతీష్‌బాబు

మల్లాపూర్: మేడ్చల్ జిల్లా బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లాపూర్ గ్రీన్‌హిల్స్ కాలనీకి చెందిన కుల్ల సతీష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ నరేష్‌వారి నియామక ఉత్తర్వులను అందజేశారు.

న్యూభవానీనగర్‌లో వంతెన పనులపై ఆరా



మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని న్యూభవానీనగర్‌లో నిర్మిస్తున్న వంతెన పనులను గురువారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. త్వరలో రిటెయినింగ్ వాల్ నిర్మించి వంతెనను ప్రారంభిస్తామన్నారు. బిడ్జి నిర్మాణం కోసం నాలాను డైవర్షన్ చేయడంతో కొంతమేర గుర్రపు డెక్క చేరిందన్నారు. త్వరగా బ్రిడ్జిని ప్రారంభిస్తే గుర్రపు డెక్క సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నేతలు సాయి, చంద్రశేఖర్, అంజి, జావీద్, శివ, గౌస్ తదితరులు ఉన్నారు.

చిన్నారిపై యువకుడి లైంగిక వేధింపులు

కుషాయిగూడ: పది సంవత్సరాల చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్‌బీకాలనీలో చోటు చేసుకుంది. ఈ నెల 11వ తేదీన జరిగిన ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ షఫి వివరాల ప్రకారం.. హెచ్‌బీకాలనీ, రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గొల్లూరి సుధాకర్ అలియాస్ గొల్లూరి సురేష్ అనే యువకుడు అమేజాన్‌లో డెలివరీ బాయ్. ఈ నెల 11వ తేదీన ఓ పది సంవత్సరాల చిన్నారిపై తన వికృత చేష్టలతో లైంగిక వేధింపులకు పాల్పడి భయాందోళనకు గురిచేశాడు. చిన్నారి ఏడ్చుకుంటూ ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. భయపడ్డారో, పరువు పోతుందని భావించారో.. కానీ ఆ దుర్మార్గుడిని దేహశుద్ధి చేసి వదిలేశారు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆగమశాస్త్రంతో ఆలయాలు నిర్మిస్తే శుభాలే..

రామంతాపూర్: ఆగమ శాస్త్రాన్ని అనుసరించి వాస్తుశాస్త్రంతో నిర్మించే ఆలయాలతో అన్నీ శుభాలే కలుగుతాయని బసవ కళ్యాణ్ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లోని రూ.కోటితో నిర్మిస్తున్న శ్రీ నల్ల పోచమ్మ ఆలయాన్ని ఆయన గురువారం పరిశీలించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ సమయంలో ఆగమశాస్త్రం ప్రకారం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆలయ కమిటీ సభ్యులకు సూచనలు చేశారు. ఆలయ చైర్మన్ గడ్డం సాయికిరణ్, సాయిబాబా దేవాలయ చైర్మన్ మహాదేవ భట్ల లక్ష్మణ్ ప్రసాద్ శర్మ, సుధాకర్, అనిల్‌గౌడ్, నవీన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాగి వెంకట్‌రెడ్డి, వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య



సుష్మ(ఫైల్)

కుషాయిగూడ: మానసిక పరిస్థితి సరిగా లేని ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. కమలానగర్‌లో నివసించే తాటిపల్లి శేఖర్ సెల్‌ఫోన్ మెకానిక్. 2019లో సుష్మ(30)ని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి సంతానం కలగలేదు. కాగా సుష్మ థైరాయిడ్, బలహీనత, గట్టిగా అరవడం వంటి అనారోగ్య సమస్యలతో సతమతం అవుతోంది. బుధవారం ఉదయం సెల్‌ఫోన్ షాపునకు వెళ్లిన శేఖర్ మధ్యాహ్నం భార్యకు ఫోన్ చేశాడు. ఈ సమయంలో భోజనం కోసం సుష్మ భర్తపై అరిచి ఫోన్ పెట్టేసింది. కొద్ది సమయానికే ఇంటి పక్క ఉన్న సుమన్ అనే వ్యక్తి శేఖర్‌కు ఫోన్ చేసి మీ భార్య పెద్దగా అరుస్తోందని చెప్పడంతో శేఖర్ ఇంటికి బయలుదేరాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

మేడ్చల్: పట్టణంలోని ఎస్‌ఎస్‌జీ స్కూల్‌కు చెందిన చిన్నారులు జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఔట్ డోర్ ట్రిప్‌లో భాగంగా చిన్నారులు గ్రంథాలయకు వెళ్లి అక్కడ ఉన్న పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులకు సంస్కృతి, చరిత్ర వంటి అంశాల పుస్తకాలను అలవాటు చేసేందుకు లైబ్రరీని సందర్శించినట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ తెలిపారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



అల్వాల్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అధికారులకు సూచించారు. గురువారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ సైబర్ క్రైమ్ విభాగం అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక కాలంలో అందుబాటులోకి వస్తున్న కొత్త సాంకేతిక పరిజ్ఞానం, పరికరాల వల్ల సైబర్ నేరాల శాతం పెరుగుతోందని తెలిపారు. వివిధ రకాల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరికరాలు ఉపయోగించక తప్పదన్నారు. కానీ అదే సమయంలో ప్రజలు సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజల్లో అవగాహన పెరిగేలా యువత భాగస్వామ్యంతో కళాశాలలు, ఇతర ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. నకిలీ లాటరీలు, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, నకిలీ బ్యాంకు అకౌంట్ సమాచారం, నకిలీ గిఫ్ట్ బాక్సుల వంటి పేరుతో ప్రజలను మోసం చేసే వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. సోషల్ మీడియాలో యువతులను వేధించే వానికి ఎట్టి పరిస్థితులలోనూ విడిచి పెట్టకూడదని అధికారులకు సూచించారు. పోలీసుల కృషి, కఠిన చర్యలతో రాచకొండ కమిషనరేట్ పరిధిలో చైన్ స్నాచర్ల బెడద చాలా వరకు తగ్గిందని, మహిళలు ప్రశాంతంగా బయటకు వెళ్లి తమ పనులు చేసుకుంటున్నారని తెలిపారు. చైన్ స్నాచింగ్ వంటి నేరాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని తెలిపారు. నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టేలా అధికారులు సిబ్బంది కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ సైబర్ క్రైమ్స్ అనురాధ, డీసీపీ క్రైమ్ మధుకర్ స్వామి, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశం, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో..

మల్కాజిగిరి: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. గురువారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ ఏపీఐఐసీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల కోసం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో చాలా మంది సత్వర వైద్య సేవలు అందుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలను ఆదుకుంటోందని అన్నారు. నియోజకవర్గంలోని తొమ్మిది డివిజన్లలో బస్తీ దవాఖానాల సంఖ్యను పెంచుతామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, డీసీ రాజు, ఆనంద్, డాక్టర్ మయూరి, డాక్టర్ సుష్మ, సూపర్‌వైజర్ ప్రకాష్, నాయకులు సత్యమూర్తి, సతీష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, గుండా నిరంజన్, బాబు, సత్యనారాయణ, సంపత్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. పీవీఎస్ కాలనీలో రూ.38 లక్షలతో చేపట్టే బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.

ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు చేయూత



ఉప్పల్‌కు చెందిన మహిళలతో మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్: మధురా చారిటబుల్ ట్రస్ట్‌తో మహిళలకు చేయూత ఇస్తున్నట్లు కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నాయకులు ట్రస్టు చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గ పరిధిలో పలు డివిజన్ల మహిళలు బ్యూటీషియన్ కోర్సు, ఎంబ్రాయిడరీ, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సు, మగ్గం వర్క్స్ వంటి కోర్సులకు శిక్షణ ఇప్పించాల్సిందిగా ఆయనను కోరారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ మధురా చారిటబుల్ ట్రస్టు ద్వారా 20 ఏళ్లుగా నియోజవర్గ పరిధిలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. త్వరలో నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో మహిళలకు చేయూత అందించే విధంగా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. మహిళలు స్వశక్తి మీద ఆధారపడే విధంగా అనేక కోర్సుల్లో శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంజరి ప్రవీణ్, సంతోష్, రాహుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ మేకల సునీతయాదవ్

గౌతంనగర్: అధికారులు సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని గౌతంనగర్, మధుసూదననగర్ కమ్యూనిటీ హాల్స్‌లో స్థానిక సమస్యలపై ప్రజా పరిచయం కార్యక్రమం జరిగింది. కార్పొరేటర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న పారిశుద్ధ్యం, దోమల బెడద, పోలీస్ గస్తీ, విద్యుత్ సమస్యలు, నీటి సమస్య, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలు వెల్లువెత్తాయి. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ దివ్యజ్యోతి, జలమండలి మేనేజర్ నవీన్‌కుమార్, శానిటేషన్ సూపర్‌వైజర్ మనోహర్‌రెడ్డి, మలేరియా విభాగం అధికారి అబ్దుల్ రహీం, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, విద్యుత్ విభాగం అధికారి సాయిలు, మధుకర్, పోలీస్ విభాగం నుంచి బాలు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫాల పంపిణీ



రంజాన్ తోఫాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: రంజాన్ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన రంజాన్ తోఫాలను గురువారం నవోదయనగర్‌లోని మజీద్‌లో మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ ముస్లింలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, అలిమోద్దీన్, నిస్సార్ అహ్మద్‌గోరి, సలీం, అఫ్రోజ్, రాజ్‌కుమార్, జయపాల్, శేఖర్‌గౌడ్, నరేందర్ పాల్గొన్నారు.

రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలి

ముస్లింల పవిత్ర రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. గురువారం చర్లపల్లి డివిజన్ ఐజీ కాలనీలోని అబ్దుల్ రజాక్ బాదర్ మజీద్‌లో నిర్వహించిన రంజాన్ తోఫాల పంపిణీకి హాజరై తోఫాలను అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనకరాజుగౌడ్, బొడిగె ప్రభుగౌడ్, బత్తుల శ్రీకాంత్‌యాదవ్, లక్ష్మారెడ్డి, సత్తమ్మ, లలితతో పాటు నజీర్‌బాయ్, తన్వర్‌పాషా, అలీబాయ్, రహమాన్ పాల్గొన్నారు.

ఇంద్రానగర్‌లో..

రామంతాపూర్: ఇంద్రానగర్‌లోని మజీద్ ఈ తౌహీద్ మజీద్‌లో గురువారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు ముస్లింలకు రంజాన్ తోఫాలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో కఠిన ఉపవాస దీక్షలు కొనసాగిస్తున్న ముస్లింలకు అల్లా ఆశీర్వాదం ఎప్పుడూ ఉంటుందన్నారు. మజీద్ కమిటీ సభ్యులు రహీం బేగ్, ఎండీ ఖాషీ, ఎండీ జహంగీర్, హిదాయత్ అలీ, ఎండీ జక్రియ, అబ్దుల్ రహీం, జాఫర్, బీజేపీ నేతలు నగేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసీఆర్ రాష్ట్రానికి చేసిందేమీ లేదు



మల్కాజిగిరి: తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ దుర్గానగర్, చింతల్‌బస్తీ ప్రాంతాల్లో గురువారం పాదయాత్ర జరిగింది. తెలంగాణ వాదాన్ని, ఉద్యమాన్ని వాడుకున్న కేసీఆర్ రాష్ట్రానికి చేసిన మేలు ఏమీ లేదన్నారు. నాయకులు ఉమేష్‌సింగ్, వెంకటేష్‌యాదవ్, వ్యాసగోని, శ్రీనివాస్, ఆంతోని, బీకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటో కాల్ పాటించరా?

మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణకు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడంపై నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని డీసీని కోరారు. నాయకులు ఉమేష్‌సింగ్, వెంకటేష్ యాదవ్, చంద్రశేఖర్, యాదగిరి, గుత్తి చందు, వినోద్ యాదవ్ తదితరులు ఉన్నారు.